83

# బతుకు కోసం బహుకృత వేషాలు

అనాది మానవ జాతి సంచార దశను దాటి, స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్నప్పటి చిత్రాలు కొన్నింటిని ఆధునిక శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పగలంతా వేటాడడం, రాత్రివేళల్లో గుహల్లో తలదాచుకోవడం, ఎండలకు వానలకు చలిగాడ్పులకు ఆ గుహలే శరణ్యం కావడం, అప్పుడప్పుడే నిప్పుతో మచ్చిక ఏర్పడడం, నిప్పును పతనానికీ, వెలుతురుకూ కూడా ఉపయోగించుకోవడం ఈ దశలోనే మనిషికి తెలిశాయని మనుష శాస్త్రవేత్తల అభిప్రాయం.

మన పూర్వీకులు గీసిన చిత్రాలు కొన్ని ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. లేడిని రాతి ఈటెతో పొడవనున్న వేటగాడు, ఐదు వేళ్ళను చూపెడుతూ ఎదుటి వారికి తన భావాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తున్న విలుకాడు, తను అక్కడెక్కడో చూసిన వొక భయంకరమైన ఏనుగును పోలిన జంతువు, కావడిలో నీరు తెస్తున్న సంసారి, ఇలాంటి చిత్రాలు ఐరోపా దేశాల్లోని పర్వత గుహల్లో ఈనాటికి వున్నాయి.

ఈ చిత్రాలను ఎవరు గీశారో తెలీదు. ఎందుకు గీసి ఉంటారన్నది ఈనాడు మనం ఊహించుతున్నాం. తొలి చిత్రం లేడిని వేటాడవలసిన విధానాన్ని తెలియజేస్తున్నది. అలాంటి లేళు ళ్ళ ఐదు వందలో, ఐదు వేలో వున్నాయనో లేదా ఐదు రూపాయలుగా చీలి తనకు చిక్కకుండా పోయాయనో చెప్పడం కావచ్చు. తాము నివసిస్తున్న అరణ్యంలో ప్రాణాపాయకరమైన జంతువులున్నాయని చెప్పడం రెండవ చిత్రం వుద్దేశ్యం కావచ్చు. పుష్కలంగా నీరు లభించే ప్రాంతాన్ని సూచించడంతో పాటు నీరు తెచ్చుకొనే పద్ధతిని తెలియజేయడం బహుశా మూడవ చిత్రం ఉద్దేశ్యమయి ఉంటుంది.

ఇప్పుడు మన భావాలను, అభిప్రాయాలను, ఉద్దేశాలను తెలియజేయడానికి మాటలను వాడుతున్నట్టే - ఒకప్పుడు బొమ్మలను కూడా వాడే వారని శాస్త్రజ్ఞులంటున్నారు. ఇది నిజంకూడా. కానీ నటరాజన్ బొమ్మలు గీయడం తన అభిప్రాయాన్ని తెలియజేయడానికి మాత్రం కాదు. కేవలమూ పొట్ట నింపుకోవటానికే.

అతనిది తంజావూర్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం. చిన్నప్పుడెపుడో చెప్పాపెట్టకుండా ఉన్న వూరు నుండి వచ్చేశాడు. కొంతకాలం పాటు మద్రాసులో వున్నాడు. అక్కడతను చాలా పనులు చేశాడు.

"ముందుగా తిండికి మాడాను. అరవం తప్ప ఇంకో భాష రాదు. పానగల్ పార్కు ముందున్న పేవ్‌మెంట్లమీద కాలక్షేపం చేసేవాణ్ణి. ఉన్న డబ్బులు అయిపోయాయి. నీళ్ళు తాగి రెండు మూడు రోజులు గడిపాను. ఒక ధర్మాత్ముడు గీతాకేఫ్‌లో పని ఇప్పించాడు. కొంతకాలం చేశా" అన్నాడు నటరాజన్. తెలుగును పట్టిపట్టి మాట్లాడుతూ.

ఆ హోటలుకు చాలా మంది సినిమావాళ్లు వచ్చేవారుట. వారందరితోనూ అతనికి క్రమక్రమంగా స్నేహం అయింది. ఈ స్నేహం కారణంగానే అప్పుడప్పుడూ సినిమా షూటింగులక్కూడా వెడుతూ వుండేవాడు. అక్కడున్న వారందరికీ అతను కాఫీలు, టీలు, ఫలహారాలు ఇంకా ఇంకా

ఆపైవీ కూడా అందిస్తూ వుండేవాడు.

ముందుగా ఆ సెట్టింగులూ, లైట్లూ, స్టార్స్, అక్కడి జనాన్ని చూసి నటరాజన్ ఆశ్చర్యపోయాడు. రూపాయలు నీళ్ళలాగా ఖర్చు కావడం చూసి అతను దిమ్మెర పోయాడు. అదేదో వో అరవ సినిమాలో చిన్న వేషం కూడా వేశాడట నటరాజన్.

''ఇలా క్రమంగా పైకి పోవచ్చు'' అని నచ్చచెప్పినవారూ ఉన్నారు. ఓ స్టార్ ఇంట్లో పనిక్కుదిరాడు. తరువాత మరో ఆర్టు డైరెక్టరు గారింటిలో చేరాడు. అక్కడే మూడేళ్ళపాటు అణిగి , మణిగి పడివున్నాడు. ఆ సమయంలోనే అతను బొమ్మలు గీయడం కూడా నేర్చుకున్నాడు.

''అంటే మా అయ్యగారు పనిమాలా నాకు నేర్పలేదండీ. నేర్పమని కూడా నేను అడగలేదు. ఆయనగానే చేస్తుంటే నేను చూస్తుండేవాణ్ని. తీరిక దొరికినప్పుడల్లా నేను గీస్తుండేవాణ్ని'' అన్నాడు నటరాజన్ - ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటూ.

ఒకసారి అతను వేసిన బొమ్మను అయ్యగారు చూసారు. చూసి మెచ్చుకున్నారు. అతనికి ఇంటిపని తగ్గించి తనకు సహాయకుడిగా అట్టే పెట్టుకున్నాడు.అయ్యగారితో బాటు ఉండటం వారికి కావలసిన అన్ని పనులు చేసిపెట్టడం నటరాజన్ వంతు.

''నేను అక్కడే వుంటే ఏం జరిగేదో చెప్పలేను. ఉండలేక పోయానండీ. దానిక్కారణాలు అడగొద్దు. ఒకసారి అయ్యగారి బంగారు గడియారం, మెళ్ళో గొలుసుపోయాయి. అన్నీ వెదికారు. ఎక్కడా దొరకలేదు. ఆఖరికి మా అమ్మగారు నా పెట్టెను వెతికితే అందులో కనిపించాయండీ'' అన్నాడు నటరాజన్ కన్నీళ్ళు పెట్టుకొంటూ.

అలావుండటం అతనికే ఆశ్చర్యంగా ఉన్నది. ''అయ్యగారు మాత్రం ఇంకేమీ మాట్లాడకుండా ఐదువందలు చేతికిచ్చి యింకెక్కడన్నా పని చూసుకోమన్నాడు. ఆయన మాత్రం నాకోసం సంసారాన్ని పాడు చేసుకుంటూరా చెప్పండి? మరింక జీవితంలో ఎవరిదగ్గరా పనిచేయగూడదనుకున్నాను. ఆ డబ్బు అయిపోయిందాకా పుణ్యక్షేత్రాలన్నీ తిరిగాను''

''చాలా కాలం దాకా నేను పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళంటే అసహ్యం వేసింది. కానీ పాట్నాలో వున్నప్పుడు నాకన్నా దరిద్రంలో వున్న ఓ అమ్మాయి కన్పించింది. నాకెందుకనో ఆమెను చూస్తే జాలివేసింది. అక్కడ వసూలయిన డబ్బు ఆమెకిచ్చాను. తీసుకోవడానికి ముందు ఒప్పుకోలా. ఒద్దంటే ఒద్దన్నది. తరువాత మాటలు కలిశాయి. ఆమెకూ దిక్కూమొక్కూలేదు. నాతో వుంటానన్నది. సరేనన్నా. నాలుగేళ్ళ క్రింద తిరుపతిలో పెళ్ళి చేసుకున్నాం. ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు''అన్నాడు నటరాజన్. దూరంగా చెట్టుకింద కూచున్న భార్యా పిల్లలను చూపెడుతూ.

దేశం తిరగడం వల్లా, హిందీ మాత్రమే తెలిసిన భార్య వుండడం వల్లా నటరాజన్ హిందీ మాట్లాడడం నేర్చుకున్నాడు. అతను ఇంగ్లీషు మాట్లాడలేడు. కానీ ఓ మాదిరి ఇంగ్లీషును అర్థం చేసుకోగలడు. తెలుగును కాస్తంత అరవ యాసతో మాట్లాడే నటరాజన్ తనిక తెలుగుదేశంలోనే ఉండిపోవాలనుకుంటున్నాట్ట.

''నాకు కావలసిన పెట్టుబడి కూడా ఏం లేదండీ. మెత్తటి బొగ్గు ముక్కలు, సుద్ద ముక్కలు రంగు రంగుల చాక్‌పీసులు చాలు. వీటితో ఏ బొమ్మనయినా అవలీలగా వేస్తాను. విష్ణుమూర్తి,

లక్ష్మీదేవి, శివతాండవం, వినాయకుడు, వెంకటేశ్వరస్వామి, నటరాజు ఏదైనా సరే''.

ప్రముఖ నటులు నటించిన సినిమాలు ఆడేటప్పుడు, వారిబొమ్మల్ని కూడా గీచి చూశానని అందువల్ల తనకు అభినందనలు లభించాయే తప్ప పైసలు రాలేదని నటరాజన్ అన్నాడు.

''దేవాలయాల ముందు ఆయా దేవుళ్ళ బొమ్మలు గీస్తా. భక్తితో కాకపోయినా భయంతోనయినా నాలుగు డబ్బులు పడతాయి. శివరాత్రినాడు శివుడి బొమ్మలు, చవితికి వినాయకుడి బొమ్మలూ గీస్తా. వెంకటేశ్వరస్వామి వారికి ఇలా సీజను లేదండీ. ఎప్పుడు బొమ్మ గీసినా పది పదిహేనుకు తక్కువ రావు అన్నాడు'' నటరాజన్.

తన భార్యకు ఈ పనిలో బొత్తిగా శ్రద్ధ లేదన్నాడు నటరాజన్. ఆవిడా తనూ హిందీలో మాట్లాడుకొంటారట.

''ఇదంతా గాలిపాటు. రోజు నిక్కచ్చిగా ఉండే పనికాదు. ఒకే చోట వుంటే రాబడి కూడా తగ్గిపోతుంది. ఒక చోట గిరాకీ తగ్గంగానే ఇంకోచోటికి మకాం ఎత్తేస్తే తప్ప లాభంలేదు. ఇప్పుడు యిలా బొమ్మలు గీసేవాళ్ళు కూడా అక్కడక్కడా పెరుగుతున్నారు. నాకూ తగిలారు అనుకోండి. మిగతా వృత్తులకన్నా ఇందులో పోటీ తక్కువగానే వుంది'' అన్నాడతను.

నటరాజన్ చాలా సాదా మనిషి, చేతులో వున్నదంతా అయిపోయిందాకా కదలడు. ఉన్నప్పుడే నాలుగు సంపాదించుకోవడం అవసరమంటుంది అతని భార్య. ఆ పద్ధతేమో అతనికి నచ్చుడు.

''భగవంతుడి మీద జనాల్లో నమ్మకం వున్నంతవరకూ నా ఆదాయానికి డోకా ఉండదు. ఇన్ని వేల సంవత్సరాల నుండి పాతుకుపోయిన ఈ నమ్మకం ఇంతలో సడలనూ సడలలేదు. నాకు ఉద్యోగం చేయాలని లేదు'' అని ఖచ్చితంగా చెప్పాడు నటరాజన్.

వర్షాకాలంలో తనకు బొత్తిగా రాబడి ఉండదన్నాడు. ఆ సమయంలో తను పస్తులు చేసిన సమయాలు కూడా వున్నాయన్నాడు. ఇన్నేళ్ల నుండి రకరకాల బొమ్మలు వేస్తూ పదిమందిని ఆకర్షిస్తున్న నటరాజన్ జీవితంలో స్థిరపడలేకపోయాడు. అతని కళను ఆదరించి ప్రోత్సహించేవారూ కరువయ్యారు.